క్లుప్తంగా

నేటి నుంచి అంబాభవానీ జాతర



విశేష అలంకరణలో భవానీ మాత

బంట్వారం: కోట్‌పల్లి మండలం బుగ్గాపూర్‌లో కొలువుదీరిన అంబా భవానీ మాత జాతర సోమవారం నుంచి ప్రారంభమవుతుందని ఆలయ పూజారి రాములు ఆదివారం తెలిపారు. మొదటి రోజు పరమేశ్వరుడికి అభిషేకం చేస్తామన్నారు. అదే రోజు యజ్ఞం, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. 28న భవానీ మాతకు అభిషేకం, మధ్యాహ్నం పల్లకీసేవ, సాయంత్రం బోనాలు, రాత్రి గోందాళం కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మ వారిని దర్శించుకోవాలని ఆయన కోరారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు



పాండురంగస్వామి

కుల్కచర్ల: మండలంలోని బండవెల్కిచర్ల గ్రామ పరిధిలో వెలసిన రుక్మిణీ సమేత పాండురంగ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం ధ్వజారోహణం, అనంతరం ప్రత్యేక పూజలు, సాయంత్రం శకటోత్సవం, 28న విశేష పంచామృతాభిషేకం, పల్లకీసేవ, 1వ తేదీ స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం, అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందని ఉత్సవ కమిటీ అధ్యక్షులు కరణం నాగేశ్వర రావు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

దర్గాలో ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి

పూడూరు: మండలంలోని షాహెద్ దర్గా ఉర్సు ఉత్సవాల్లో ఆదివారం పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా దర్గాలో పులు, చాదర్ సమర్పించారు. స్నేహభావంతో ఉత్సవాలు జరుపుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. అంతకుముందు ఉత్సవ నిర్వాహకులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అజారుద్దీన్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, నాయకులు రహీంఖాన్ జెడ్పీటీసీ మేఘమాల, నాయకులు నర్సింహారెడ్డి, హరీశ్వర్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటాం



బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

దోమ: కష్టాల్లో పేద ప్రజలను అన్ని విధాలా ఆదుకుంటామని కేఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఈడిగి బిచ్చయ్య అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆయన ట్రస్ట్ సభ్యులతో బాధిత కుటుంబానికి రూ. 5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు బంగ్ల వెంకటయ్య, గోపాల్, మల్లయ్యగౌడ్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



బాధిత కుటుంబీకులకు ఆర్థిక సాయం అందజేస్తున్న గణపతి సేవా సమితి సభ్యులు

కుల్కచర్ల: చౌడాపూర్ మండలం కొత్తపల్లికి చెందిన యాదయ్య, లింగం కుటుంబీకులు రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నారు. వీరికి గణపతి సేవా సమితి నిర్వాహకులు రూ. 50వేలు ఆర్థిక సాయం చేశారు. ఆపదలో ఉన్న వారికి గణపతి సేవా సమితి అండగా నిలుస్తుందని సంఘం నేతలు పేర్కొన్నారు.

సెంట్రల్ లైటింగ్ ఎప్పటికో..!

- ఆర్‌అండ్‌బీ అధికారుల తీరుపై జనం మండిపాటు
- కోట్‌పల్లి ప్రధాన రహదారిపై తరచూ ప్రమాదాలు
- వెంటనే లైట్లు ఏర్పాటు చేయాలని వినతి



లైటింగ్ వ్యవస్థ లేని కోట్‌పల్లి ప్రధాన రహదారి

బంట్వారం: మండల కేంద్రమైన కోట్‌పల్లి ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై డివైడర్లు ఏర్పాటు చేసిన అధికారులు సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయడం మరిచారు. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారుల తీరుపై ప్రజలు మండిపడుతున్నారు. కోట్‌పల్లి ఆంధ్రా బ్యాంక్ నుంచి మార్కెట్ కమిటీ ఆఫీసు వరకు రూ. 25లక్షలతో డివైడర్లను ఏర్పాటు చేశారు. ఈ పనులు పూర్తయి మూడేళ్లు కావస్తోంది. అయినా మధ్యలో విద్యుత్ స్తంభాలు నాటి సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు పనులను మాత్రం ప్రారంభించలేదు. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనచోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

తరచూ ప్రమాదాలు

తాండూరు – సదాశిపేట నేషనల్ హైవే మధ్యలో కోట్‌పల్లి ఉంది. ఈ మార్గంలో నిత్యం వందలాది భారీ వాహనాలు తిరుగుతుంటాయి. డివైడర్లు నాటి వన్‌వే చేయడంతో కోట్‌పల్లి ప్రధాన రహదారి ఇరుకుగా కనిపిస్తోంది. మూల మలుపుల వద్ద రెండు వైపులా రోడ్డు మరింత చిన్నగా మారింది. ఏడాది క్రితం తాండూరు నుంచి వెళుతున్న ఓ కారు అదుపు తప్పి దుకాణంలోకి దూసుకెళ్లింది. షెట్టర్ మూసి ఉండడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

బస్సులు వెనక్కి తిప్పడం కష్టమే

రోడ్డు మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేయడంతో ఆర్టీసీ బస్సులను వెనక్కి తిప్పడం డ్రైవర్లకు కష్టంగా మారింది. వికారాబాద్ – కోట్‌పల్లి లోకల్ బస్సులు బస్టాండ్ దగ్గర నుంచే వెనుదిరుగుతాయి. ప్రధాన రహదారి పక్కన బస్టాండ్ ఉంది. అక్కడే ప్రైవేటు వాహనాలు నిలుపుతారు. ఇరువైపులా రోడ్డు ఇరుకుగా మారడం, మధ్యలో డివైడర్లు ఏర్పాలు చేయడంతో బస్సులు వెనక్కి తిప్పడం ఇబ్బందిగా మారింది.

ప్రతిపాదనలు పంపాం

కోట్‌పల్లి ప్రధాన రహదారిపై సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటుకు రూ. 32లక్షలతో ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం. స్థానికుల వినతుల మేరకే రూ. 25లక్షలతో డివైడర్లు ఏర్పాటు చేశాం. రోడ్డుకు రెండు వైపులా ఐదున్నర మీటర్లకు తగ్గకుండా డబుల్ లేన్ సీసీ రోడ్డు వేశాం. కొన్ని చోట్ల రోడ్డుకు దగ్గరగా దుకాణాలు ఉండడంతోనే ఇరుకుగా కనిపిస్తోంది. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస్, డీఈ ఆర్‌అండ్‌బీ

పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి

బీసీ సంఘం తాలూకా అధ్యక్షుడు బస్వరాజ యాదవ్



మాట్లాడుతున్న బస్వరాజ యాదవ్

కొడంగల్ రూరల్: పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలని జాతీయ బీసీ సంఘం తాలూకా అధ్యక్షుడు బస్వరాజ యాదవ్, సంఘం నాయకుడు చంద్రశేఖర్‌గౌడ్ కోరారు. ఆదివారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడారు. నాలుగు దశాబ్దాలుగా సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో బీసీలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు, జనాభా దామాషా ప్రకారం బడ్జెట్లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, మండల కమిషన్ రిజర్వేషన్లు పూర్తిగా అమలు చేయాలని కోరారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే ఉపయోగించుకుంటున్నారని, రాజకీయంగా, ఆర్థికంగా సమాజంలో బీసీలను వెనకకు నెట్టడానికి ప్రధాన రాజకీయ పార్టీలు పనిచేస్తున్నట్లు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యలో బీసీలకు ప్రాధాన్యత కల్పించాలని, స్కాలర్ షిప్, మెస్ చార్జీలు వెంటనే అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు వెంకటాపురం మాధవులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న ఎంఈవో వెంకటయ్య

తాండూరు: పట్టణంలోని కృష్ణవేణి కాన్సెప్ట్ స్కూల్‌లో ఆదివారం జాతీయ వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి వెంకటయ్య హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొదటి రోజు విద్యార్థులు పలు విభాగాల్లో ప్రదర్శనలతో ప్రతిభను కనబరిచారు. కార్యక్రమానికి ప్రైవేట్ పాఠశాలల అసోషియేషన్ ప్రతినిధులు, స్థానిక నాయకులు హాజరయ్యారు.

వీరత్వానికి ప్రతీక ఛత్రపతి శివాజీ

- యువత ఛత్రపతిని ఆదర్శంగా తీసుకోవాలి
- ఎంపీటీసీ రాములు



శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న ఎంపీటీసీ, గ్రామస్తులు

దోమ: వీరత్వానికి ప్రతీక ఛత్రపతి శివాజీ అని ఆయన్ను యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీటీసీ రాములు, సర్పంచ్ సురేశ్ సూచించారు. ఆదివారం మండలంలోని బొంపల్లిలో గ్రామస్తులు, యువతతో కలసి ఛత్రపతి శివాజీ విగ్రహా ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శివాజీ పరిపాలన నేటి పాలకులందరికీ ఆదర్శ ప్రాయమని, తన పాలనలో కులమతాలను సమదృష్టితో చూశారని అన్నారు. హిందూ, ముస్లిం అనే తేడా లేకుండా ఆలయాలు, మసీదులను పునరుద్ధరించారని, కానీ కొంత మంది శివాజీని హిందూ రాజుగా అభివర్ణించడం సరికాదన్నారు. భారతీయులంతా సోదరభావంతో కలిసిమెలిసి జీవించాలన్నదే శివాజీ ఆకాంక్ష అన్నారు. కార్యక్రమంలో ఆర్‌పీఐ రాష్ట్ర ప్రచార కమిటీ చైర్మన్ రామన్న మాదిగ, హిందూ వాహిని జిల్లా సమాచార ప్రముఖ్ నర్సింహ యాదవ్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రమేశ్, గ్రామ మాజీ సర్పంచ్ గందె రాములు, బొంపల్లి ప్రైమరీ పాఠశాల స్కూల్ చైర్మన్ టీ శ్రీనివాస్, వార్డు సభ్యుడు బోయిని శేఖర్, కో –ఆప్షన్ సభ్యుడు నర్సింహారెడ్డి, గ్రామస్తులు గుడిసె సాయన్న, గుడిసె బాబు, చాకలి భాస్కర్, కుర్వ రమేశ్, విజయ్, మంత్రి నర్సింహులు, చంద్రకంటి శ్రీనివాస్, రావుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

‘కొండా’ సేవలు అభినందనీయం



అనంతగిరి: కేక్ కట్ చేస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, పాల్గొన్న నేతలు, యువతులు

కుల్కచర్ల: పేదల అభ్యున్నతికి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి చేస్తున్న సేవలు అభినందనీయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కరణం ప్రహ్లాదరావు అన్నారు. ఆదివారం కుల్కచర్ల పార్టీ కార్యాలయంలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కొండా మాధవరెడ్డి ట్రస్ట్ మండల కోఆర్డినేటర్ రాంచంద్రయ్య, చాపల గూడెం సర్పంచ్ లక్ష్మణ్, బీజేపీ మండల అధ్యక్షుడు మైపాల్, కుల్కచర్ల మాజీ సర్పంచ్ జానకిరాం, మాజీ ఎంపీటీసీ అంజిలయ్య పాల్గొన్నారు.

వికారాబాద్‌లో..

అనంతగిరి: వికారాబాద్‌లోని కొండా బాలకృష్ణారెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్‌రెడ్డి కేక్‌కట్ చేశారు. అనంతరం జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద ఉత్తమ విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి చంద్రశేఖర్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాండుగౌడ్, సీనియర్ నాయకులు మాధవరెడ్డి, మాజీ కౌన్సిలర్ సుచరితరెడ్డి, పట్టణ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, శివప్రసాద్ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం

యాలాల: చెవేళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం పలువురు పేద విద్యార్థులకు ఆర్థిక సాయం చేశారు. మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన 30 మంది విద్యార్థులకు రూ.1500 విలువ గల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు హన్మంతు, మండల అధ్యక్షుడు మహిపాల్, నాయకులు పటేల్ విజయ్‌కుమార్, హన్మంతు, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

బంట్వారం: చేవేళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా జేకేఎంఆర్ ఫౌండేషన్ తరపున ఆదివారం బంట్వారం, కోట్‌పల్లి మండల కేంద్రాల్లోని పలువురు విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేశారు. అంతకు ముందు బీజేపీ నాయకులు కేక్ కట్ చేసి మాజీ ఎంపీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు మహేష్, కృష్ణాయాదవ్, నాయకులు మల్లేశం, శివ కుమార్, చంద్రయ్య, వెంకట్, జేకేఎంఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు సామేల్ తదితరులు పాల్గొన్నారు.

ధారూరు: మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతిలో టాపర్లుగా నిలిచిన 40 మంది పేద విద్యార్థులకు రూ. 1,500ల చొప్పున ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో జేకేఎంఆర్, కేవీఆర్ ఫౌండేషన్ల మండల అధ్యక్షుడు షరీఫ్, బీజేపీ నాయకులు నెల్లి విశ్వనాథం, రవీందర్ గౌడ్, ఎం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మర్పల్లిలో..

మర్పల్లి: మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలంలో ఆదివారం కొండా విశ్వేశ్వర్ జన్మదిన వేడుకలను జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ కేక్ కట్ చేశారు. అనంతరం పేద విద్యార్థులకు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మల్లేశ్ యాదవ్, ఫౌండేషన్ మండల చైర్మన్ బీ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

యాలాల: మండలంలోని అగ్గనూరు ఉన్నత పాఠశాలలో 2003 –04 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు అప్పటి ఉపాధ్యాయుల సేవలను గుర్తు చేసుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. అప్పట్లో పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు నారాయణ, బస్వరాజ్, శ్యాంసన్, నిర్మలాబాయి, హన్మంతు, కృష్ణారెడ్డి, సాయిరెడ్డి, కృష్ణకుమార్, గ్రామ సర్పంచ్ భీమప్పను ఘనంగా సన్మానించారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

సర్పంచ్ శైలజ



చెత్తను తొలగిస్తున్న సంత్ నిరంకారీ సభ్యులు

చేవెళ్ల: పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ బండారి శైలజ అన్నారు. మండల కేంద్రంలోని లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయ పుష్కరిణి వద్ద జాతరకు వచ్చిన ప్రజలు వేసిన చెత్త చెదారాలను చేవెళ్ల సంత్ నిరంకారీ సత్సంగ్ ఆధ్వర్యంలో పరిశుభ్రం చేసే కార్యక్రమాలను నిర్వహించారు. సంత్ నిరంకారీ సత్సంగ్ వారి ప్రాజెక్ట్ అమృత్ కార్యక్రమాల్లో భాగంగా స్వచ్ఛమైన నీరు, స్వచ్ఛమైన మనస్సు అనే కార్యక్రమాన్ని సర్పంచ్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని జాతర ఉత్సవాల భాగంగా ఆలయ పరిసరాలు చెత్త చెదారంతో నిండిపోయాయని చెప్పారు. గ్రామ పంచాయతీ ద్వారా పరిశుభ్రం కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ జాతరకు జనం ఎక్కువగా రావడంతో అపరిశుభ్రంగా మారుతునే ఉందన్నారు. స్వచ్ఛందంగా సంత్ నిరంకారీ సత్సంగ్ చేవెళ్ల మండల శాఖ సభ్యులు ముందుకు వచ్చి వారి ప్రాజెక్ట్ అమృత్ పేరుతో పారిశుద్ధ్యం కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. పుష్కరిణి పరిసరాలలో జాతరకు వచ్చిన ప్రజలు సేద తీరి అక్కడే వంట వార్పు చేసుకొని ఉండడంతో పెద్ద ఎత్తున చెత్త చెదారం పెరుకుపోయిందని చెప్పారు. దీనిని సంత్‌నిరంకారీ సత్సంగ్ సభ్యులు పుష్కరిణి పరిసరాలను పరిశుభ్రంగా చేశారు. ఈ సందర్భంగా సంత్ నిరంకారీ సత్సంగ్ చేవెళ్ల మండల శాఖ అధ్యక్షుడు మాణిక్యప్రభు ఆధ్వర్యంలో పనిచేసిన బృందం సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సత్సంగ్ సభ్యులు తదితరులు ఉన్నారు.

రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే

మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



విద్యార్థికి చెక్కు అందజేస్తున్న విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల: రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో బీజేపీ నాయకులతో కలిసి ఆయన తన జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో మోదీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం చేస్తున్న మోసాలు, స్కీంలు, అన్నింటి గురించి కూడా ప్రజలకు వివరముగా తెలియజేయాలని చెప్పారు. కేవీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులు 18 మందిని గుర్తించి వారికి నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు కంజర్ల ప్రకాశ్, నియోజకవర్గం నాయకులు వర్రి తులసీరామ్ విజయ్‌కుమార్, కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్ష కార్యదర్శులు పాండురంగారెడ్డి, అత్తెల్లి అనంత్‌రెడ్డి, దళిత మోర్చా మండల అధ్యక్షుడు అశోక్, చేవెళ్ల బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి, శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు రాములుగౌడ్, సురేశ్, జిల్లా నాయకులు నితిష్‌రెడ్డి, మండల నాయకులుతదితరులు పాల్గొన్నారు.

1వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు

పరిగి: పట్టణంలోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి 36వ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యుడు ప్రవీణ్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి ఒకటి నుంచి 3వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని తెలిపారు. 108 యజ్ఞగుండములతో యజ్ఞాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నాలుగు రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకోవాలని సూచించారు.

సత్తాచాటిన కొందుర్గు విద్యార్థి

కొందుర్గు: న్యూమాంక్స్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ అంబేద్కర్ జగ్జీవన్‌రావు హాల్‌లో ఆదివారం నిర్వహించిన కరాటే టోర్నమెంట్‌లో కొందుర్గు విద్యార్థి ఎండీ నాహీద్ అండర్–12 కటాస్ బాలికల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించినట్లు రంగారెడ్డి జిల్లా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా అక్కడి న్యూమాంక్స్ కుంగ్‌ఫూ గ్రాండ్ మాస్టర్ కమల్ భాష నాహీద్‌కు ప్రశంసా పత్రం, మెడల్ అందజేశారు. ప్రతిభ చాటిన విద్యార్థిని కుంగ్‌ఫూ అసోషియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాజేష్‌పటేల్, కొందుర్గు మండల అసోషియేషన్ అధ్యక్షుడు శివకుమార్ అభినందించారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

షాద్‌నగర్‌టౌన్: మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామ శివారులో ఉన్న ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ ఆశ్రమంలో ఆదివారం షాద్‌నగర్ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రమేష్ బండారి, ఆధ్వర్యంలో డాక్టర్లు చందులాల్ రాథోడ్, విజయ్‌కుమార్, శారద, అనిల్ బండారి, సురేష్, ప్రేమ్‌సాయి, కార్తికేయలు అనాథ వృద్ధులు, చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఫ్ఎన్‌సీ వ్యవస్థాపకులు డాక్టర్ గీతా, థామస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రవాణా రంగ సమస్యలు పరిష్కరించాలి

షాద్‌నగర్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సయ్యద్ సాధిక్



కేంద్ర సహాయ మంత్రితో సయ్యద్ సాధిక్, నాయకులు

షాద్‌నగర్: రవాణా రంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని షాద్‌నగర్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సయ్యద్ సాధిక్ డిమాండ్ చేశారు. బెంగళూరులో నిర్వహిస్తున్న ఆల్ ఇండియా మోటార్ ట్రాన్స్‌పోర్టు సమావేశాలకు ఆదివారం షాద్‌నగర్ నుంచి లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు వెళ్లారు. ఈ సందర్భంగా సయ్యద్ సాధిక్ మాట్లాడుతూ... కరోనా నేపథ్యంలో రవాణా రంగం పూర్తిగా కుదేలయిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం వాహనదారులను ఇబ్బందులకు గురిచేసే విధంగా నిర్ణయాలు తీసుకోవడం సరికాదని అన్నారు. ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన మోటార్ వెహికల్ యాక్టును రద్దు చేయాలన్నారు. అదేవిధంగా వాహనదారుల నుంచి గ్రీన్ ట్యాక్స్ పేరుతో అధిక మొత్తంగా ప్రభుత్వం డబ్బులు వసూలు చేస్తున్నారని, దీంతో వాహనదారులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఫెనాల్టీలను రద్దు చేసి పాత పద్ధతిలోనే వాహనాలకు ఫిట్‌నెస్ చేయాలని వివరించారు. పెట్రోల్, డీజిల్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తీసుకోవాలని, రోజు రోజుకు ఇంధనం ధరలు పెంచుతుండడంతో వాహనాలు నడపలేక అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం ప్రతి మూడు నెలలకు ఒకసారి వసూలు చేసే రుసుమును తగ్గించాలన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సరుకు రవాణా వాహనాలు వెళ్లడానికి వీలుగా ప్రభుత్వం సింగిల్ పర్మిట్ ఒప్పందం చేసుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం వాహనాలకు పెంచిన బీమా ప్రీమియాన్ని తగ్గించాలన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు కేంద్ర సహాయ మంత్రి వీకే సింగ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. సమావేశానికి వెళ్లిన వారిలో నవాజ్ గోరి, కాలేద్, షాహిద్ తదితరులు ఉన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



ప్రతాప్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న నిర్వాహకులు

మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

షాద్‌నగర్: యువత క్రీడల్లో రాణించాలని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని బిన్ని మిల్స్ వారి ఆధ్వర్యంలో మూడవ గ్రామీణ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆదివారం ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని అన్నారు. యువత క్రీడల్లో రాణించి భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని తెలిపారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓడిపోయిన వారు నిరుత్సాహ పడకుండా రెట్టించిన ఉత్సాహంతో ముందుకు సాగాలన్నారు. క్రీడలు మనిషి జీవితంలో భాగమైపోయాయని అన్నారు. క్రీడలు ఆడడం ద్వారా ఎంతో ఉత్సాహంగా ఉల్లాసంగా, ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మధు, టోర్ని నిర్వాహకులు సంజీవరెడ్డి, రాజు, ఇన్నాతి మహేందర్, రాయల్ రాజు, మల్లేష్ పాల్గొన్నారు.